సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



పగలు రెక్కీ.. రాత్రి చోరీ

ఉదయం మేకలు, గొర్రెలు ఎక్కడున్నాయో రెక్కీ నిర్వహించి రాత్రివేళ అపహరిస్తున్న ముఠా గుట్టు పోలీసులు రట్టు చేశారు. 8లో▸



ఔటర్‌పై ఘోర ప్రమాదం

ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో నలుగురి పరిస్థితి విషమంగా మారింది. 8లో▸



టీఎల్ఎం మేళాకు..

జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు బాటసింగారం జెడ్పీహెచ్ఎస్ ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

యూరియాకోసం రోడ్డెక్కిన రైతులు



మొయినాబాద్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

మొయినాబాద్: యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. మొయినాబాద్‌లోని బాలాజీ ఫర్టిలైజర్ దుకాణానికి మంగళవారం 150 బస్తాల యూరియా వచ్చింది. వ్యవసాయాధికారులు రైతులకు టోకెన్లు ఇవ్వడంతో షాపు వద్దకు వెళ్లి క్యూకట్టారు. చివరగా వచ్చిన కొంత మంది రైతులకు బస్తాలు సరిపోకపోవడంతో ఆందోళనకు దిగారు. షాపుముందే రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. గురువారం మరో లోడు వస్తుందని.. మిగిలిన రైతులు తీసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి అనురాధ చెప్పారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి



చౌదరిగూడ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ లింగయ్య

కొందుర్గు: విద్యార్థులు చదువులో మరింత రాణించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య సూచించారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో అమలు తీరును పరిశీలించడంలో భాగంగా మంగళవారం కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చౌదరిగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, చౌదరిగూడ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలుతీరు తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సివిల్ వర్క్స్, యూడైస్ పీఎం పోషణ్ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త విద్యార్థుల నమోదు, విద్యార్థులు, ఉపాధ్యాయుల ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్‌ను పరిశీలించారు. చౌదరిగూడ పాఠశాలలో విద్యార్థులతోపాటు తరగతి గదిలో కూర్చొని ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు గాయత్రీదేవి, కిరణ్‌కుమార్ రెడ్డి, హెచ్ఎంలు సునీత, రాగసుధ, పార్వతమ్మ తదితరులు ఉన్నారు.

గొల్లగూడలో కొండచిలువ కలకలం



యాచారం: తాడిపర్తి అనుబంధ గ్రామమైన గొల్లగూడకు కొండ చిలువ రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అటవీ ప్రాంతం, వ్యవసాయ పొలాల పక్కనే ఉన్న గొల్లగూడకు మంగళవారం రాత్రి ఓ కొండ చిలువ వచ్చింది. ఎడ్ల శ్రీరాములు ఇంట్లోకి ప్రవేశించింది. గమనించిన శ్రీరాములు భార్య జ్యోతి కేకలు వేస్తు రోడ్డు పైకి వచ్చింది. దీంతో గ్రామస్తులు దాన్ని బయటకు వచ్చేలా చేసి కొట్టి చంపారు.

ప్రత్యేకం.. అస్తవ్యస్తం

కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు ముగిసి ఇప్పటికే 233 రోజులు పూర్తయింది. పాలకవర్గాల స్థానంలో ప్రత్యేక అధికారులుగా జిల్లా అడిషనల్ కలెక్టర్‌లు, ఆర్డీఓ స్థాయి అధికారులను నియమించారు. దీంతో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే
- పాలకవర్గాల గడువు ముగిసి ఇప్పటికే 233 రోజులు
- కార్యాలయాలకే పరిమితమైన ప్రత్యేక అధికారులు
- క్షేత్రస్థాయిలో కరువైన పర్యవేక్షణ.. సేవలకు ఆటంకం



తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త

తుర్కయంజాల్: జిల్లాలో బడంగ్‌పేట్, మీర్‌పేట, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్లతో పాటు తుర్కయంజాల్, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, మణికొండ, నార్సింగి, శంకర్‌పల్లి, కొత్తూరు, ఆమనగల్లుతో పాటు నూతనంగా ఏర్పడిన మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో దేనికి కూడా పాలకవర్గాలు లేవు. గడువు ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలోనే ఉన్నాయి. పని ఒత్తిడి కారణంగా వారు ఆయా మున్సిపాలిటీలపై దృష్టి సారించలేకపోతున్నారు. వీరి చేతుల్లోకి పాలన వచ్చి నెలలు గడుస్తున్నా క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకోలేకపోతున్నారు. కార్యాలయాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫైళ్లపై సంతకాల కోసం ఆయా మున్సిపల్ కమిషనర్లు, ఇతర సిబ్బంది ప్రత్యేకాధికారుల కార్యాలయాల వద్దకే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అధికారుల తీరుపై ఆరోపణలు

పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారులు పని ఒత్తిడిలో బిజీగా ఉండటంతో కొందరు కమిషనర్లు, ఇతర సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుబాటులో ఉండకపోవడం, సకాలంలో కార్యాలయాలకు రాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంటి నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్ విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని రుజువు చేస్తూ ఇటీవల నార్సింగి టీపీఓ మణిహారిక ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్, మ్యూటేషన్లు, ట్రేడ్ లైసెన్స్ జారీలో సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా చోట్ల దరఖాస్తుదారులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. చేయి తడిపితే కానీ ఫైలు ముందుకు కదలని దుస్థితి నెలకొంది. పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు.

జీహెచ్ఎంసీ పదవీ కాలం ముగిసే వరకు..

మేయర్‌లు, ఉప మేయర్‌లు, చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కార్పొరేటర్‌లు, కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. గడువు ముగియడంతో ప్రభుత్వం ఎన్నికలకు ఎప్పుడు వెళ్తుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారా లేక గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు, నాలుగు కార్పొరేషన్‌లుగా విభజిస్తారా అనేదానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ముగిసే వరకు వేచి చూస్తే తప్ప భవిష్యత్తు ఏమిటనేది తేలేలా లేదు. జీహెచ్ఎంసీ పదవీ కాలం ముగిసే వరకు కూడా శివారు ప్రాంతాలకు ప్రత్యేకాధికారుల పాలన తప్పదు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల మంజూరులో ప్రభుత్వం విఫలం
- ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కదండి శ్రీరామ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కదండి శ్రీరామ్ విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని హెచ్చరించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను గాడిలో పెడతామని గొప్పలు చెప్పి, అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటినా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా విద్యార్థులను అరిగోస పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు దొంతగోని శివకృష్ణ, శ్రీకాంత్, మహేశ్, స్టేట్ లా సెల్ కన్వీనర్ సాయి చరణ్, విభాగ్ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

మరో పది చోట్ల విజయ డెయిరీ పార్లర్లు

- షాద్‌నగర్ విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌మురళి



ఎంసీసీ మేనేజర్, సిబ్బందితో సమావేశమైన డీడీ మోహన్‌మురళి

కడ్తాల్: తెలంగాణ పాడిపరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో విజయ డెయిరీ పాల ఉత్పత్తులను విక్రయించేందుకు త్వరలో జిల్లాలో పది చోట్ల విజయ డెయిరీ పార్లర్‌లను ప్రారంభించనున్నట్లు షాద్‌నగర్ డివిజన్ విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి అన్నారు. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో పాల సేకరణ, స్వచ్ఛత, నాణ్యతా ప్రమాణాలపై మంగళవారం మేనేజర్, సిబ్బందితో సమావేశమయ్యారు. నాణ్యమైన పాలసేకరణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా ముందజలో ఉందని, సేకరణలో రాష్ట్రంలోనే కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం ముందువరుసలో ఉందని తెలిపారు. జిల్లాలోని కందుకూరు, ఆమనగల్లు, కొందుర్గు, షాద్‌నగర్, షాబాద్, తుక్కుగూడతో పాటు మరో నాలుగు చోట్ల విజయ పాల ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంసీసీ మెనేజర్ ప్రాణేశ్‌కుమార్, క్వాలిటీ కంట్రోలు అధికారిణి ఉదయశ్రీ, సూపర్‌వైజర్ లింగస్వామి పాల్గొన్నారు.

చిలుకూరులో కృష్ణాష్టమి వేడుకలు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రంగరాజన్ మాట్లాడుతూ.. ఉట్ల పండుగ అంటే కేవలం హండీ పగలగొట్టడం కాదని.. అది వర్ణ, కుల, తరగతుల మధ్య ఉన్న భిన్నతలను తొలగించడం అన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని నిర్వహించే ఈ వార్షిక పండుగ ఐక్యతను ప్రతిబింబిస్తుందన్నారు. వేడుకల్లో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ పురవీధుల్లో స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పాల్మాకుల జంగయ్య

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య

షాద్‌నగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మంగళవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని విమర్శించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటాలను స్మరించుకుంటూ అన్ని వర్గాల వారు హక్కుల సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, బుద్దుల జంగయ్య, నాయకులు షకీల్, గోవింద్ నాయక్, నర్సింహ, గడ్డం జంగయ్య, వెంకటేశ్, లింగం నాయక్, చంద్రబాబు పాల్గొన్నారు.

పోరాటానికి మతం రంగు పూయొద్దు

కందుకూరు: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పూయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం పార్టీ మండల కార్యదర్శి కొమ్మగళ్ల రాజు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆనాటి పోరాటంతో ఎలాంటి సంబంధం లేని ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదంతో చరిత్రను వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సభ్యుడు పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.దత్తునాయక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పట్నాటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకు యూరియా



ఇబ్రహీంపట్నం రూరల్: యూరియా విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఉష

- జిల్లా వ్యవసాయాధికారి ఉష

ఇబ్రహీంపట్నం రూరల్: రైతుల అవసరం మేరకు జిల్లాలో యూరియా అందుబాటులో ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. మండల పరిధిలోని పోల్కంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో విక్రయిస్తున్న యూరియా కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వ చేసే గోదాము ఈపాస్ మిషన్ ద్వారా విక్రయాలను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. యూరియా కోసం తిప్పలు పడాల్సిన అవసరం లేదని, కావాల్సినంత ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు తప్పనిసరిగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఓ హరినాథ్, ఏఈఓ సృజన, పీఏసీఎస్ సీఈఓ లక్ష్మయ్య, ఎస్ఐ చందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

మంచాల: యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. మంచాల పీఏసీఎస్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్, ఏఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆ భూములు మీవి కావు!

- అథారిటీలో జమ చేసిన డబ్బులు మాత్రమే మీవి
- వాటిని ఎందుకు తీసుకోవడం లేదు, అభ్యంతరాలేమిటి వివరణ ఇవ్వండి
- ఫార్మా రైతులకు సీసీఎల్ఏ నోటీసులు
- ఆందోళనలో బాధితులు



కుర్మిద్దలో టీజీఐఐసీ పేరు మీద రికార్డులు మార్చేసిన పట్టా భూమి

యాచారం: ఫార్మా రైతులకు మళ్లీ నోటీసులు జారీ అయ్యాయి. అథారిటీలో జమ చేసిన పరిహారం డబ్బులు ఎందుకు తీసుకోవడం లేదో అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని సీసీఎల్ఏ నుంచి వ్యక్తిగత నోటీసులు అందజేస్తున్నారు. అప్పట్లో ఫార్మాసిటీకి స్వచ్ఛందంగా పట్టా భూములిచ్చిన రైతులకు ఎకరాకు రూ.16 లక్షల పరిహారం అందజేశారు. టీజీఐఐసీ పేరు మీద భూరికార్డులు మార్చిన రైతులకు మాత్రం ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారాన్ని అథారిటీలో జమ చేశారు. మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ మెగా వెంచర్‌లో ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్లు కూడా కేటాయించారు. హైకోర్టు రైతులకు మద్దతుగా టీజీఐఐసీ పేరు మీదున్న భూ రికార్డులను తిరిగి రైతుల పేర్లపై మార్చాలని తీర్పు ఇచ్చినా అధికారులు లెక్క చేయడం లేదు. తాజాగా సీసీఎల్ఏ నుంచి నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నగరంలోని సీసీఎల్ఏలో వ్యక్తిగతంగా హాజరు కావాలని వ్యక్తిగత నోటీసులు వచ్చాయి. 'భూ రికార్డులు మీ పేర్లపై లేనందున ఇక ఆ భూములు మీవి కావని, ఆ భూములపై మీకు హక్కు లేదని.. అథారిటీలో జమ చేసిన డబ్బులే మీవి' అంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. అథారిటీలో జమ చేసిన డబ్బులు తీసుకోకపోతే ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాల్సి వస్తుందన్నారు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

న్యాయం చేయండి సారూ..

సీసీఎల్ఏ నుంచి నోటీసులు అందుకున్న నాలుగు గ్రామాల రైతులు మంగళవారం నగరంలోని రైతు కమిషన్ కార్యాలయంలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిని కలిశారు. మీరే న్యాయం చేయాలని విన్నవించారు. పరిహారం డబ్బులు అథారిటీలో జమ చేసిన విషయం ప్రత్యేక కోర్టు పరిధిలో ఉందని, రైతులకు అన్యాయం జరగకుండా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ప్రొఫెసర్ కోదండరాం కలిసిన రైతులు తమ గోడు వెలిబుచ్చారు.

“ నాలుగేళ్లుగా బాధపడుతున్నాం



టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన భూ రికార్డులు మళ్లీ మా పేరుపై మార్చాలని నాలుగేళ్లుగా అధికారులను ప్రాధేయపడుతున్నాం. అప్పట్లో రాత్రికిరాత్రే పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేసి, ఇప్పుడేమో ఎందుకు తీసుకోవడం లేదని నోటీసులు పంపుతున్నారు. ఏళ్లుగా కోర్టులు, అధికారుల చుట్టూ తిరగాల్సిందేనా.

– ఆరెపల్లి లక్ష్మమ్మ, నక్కర్తమేడిపల్లి

వ్యక్తిగతంగా హాజరుకావాలి



అథారిటీలో ఫార్మా పరిహారం డబ్బులు జమ చేసిన రైతులకు సీసీఎల్ఏ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. వ్యక్తిగతంగా నోటీసులు అందుకున్న రైతులు అభ్యంతరాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. అథారిటీలో జమ చేసిన డబ్బులు తీసుకోకపోతే సీసీఎల్ఏ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదు.

–అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

ఫీజు బకాయిలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ముత్యాల భాస్కర్ మండిపడ్డారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు రావాల్సిన రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం ఇబ్రహీంపట్నంలో బీజేవైఎం మున్సిపాలిటీ అధ్యక్షుడు కంబాలపల్లి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గు చేటన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సరైన సమయానికి రాకపోడంతో ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నాయిని సత్యనారాయణ, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్ సభ్యుడు రాఘవేంద్ర స్వామి, బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ముత్యాల భాస్కర్

ఔటర్‌పై ఘోర ప్రమాదం

ఆగి ఉన్న కారు ఢీకొట్టిన లారీ

- ఒకరు మృతి.. నలుగురి పరిస్థితి విషమం
- మృతుడు, క్షతగాత్రులు ఆంధ్రప్రదేశ్ వాసులు


శివకోటి మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: రోజు వారీ పనుల్లో అలసిన కార్మికులు సేదతీరుదామనుకున్నారు. సరదాగా వెళ్లిన వారి ప్రయాణాన్ని మృత్యువు వెంటాడింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి ఆది బట్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవి కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి చెందిన రాజేంద్ర కీసర మండలం బోగారంలో బిల్డర్. అతని వద్ద వినుకొండకు చెందిన శివకోటి(27), పొందూరుకు చెందిన కాంత్రికుమార్, శ్రీహరి, మహేశ్ వర్మ, రామకృష్ణ కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వారంతా కలిసి రోజు పనుల్లో అలసిపోతున్నాం.. సరదాగా ఎయిర్ పోర్టు చూసొద్దామని నిర్ణయించుకున్నారు. రాత్రి భోజనం పూర్తి చేసుకుని కారులో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓఆర్ఆర్‌పై బొంగ్లూరు జంక్షన్ సమీపంలో ఎగ్జిట్ 13–12 మధ్య శ్రీశ్రీ ఎరోసిటీ సమీపంలో మూత్ర విసర్జన కోసం పార్కింగ్ లైట్లు వేసి కారు నిలిపారు. ఇద్దరు కా రులో కూర్చోగా మరో నలుగురు కారు ఎదుట ఉన్నారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ వీరి కారును ఢీకొట్టి ముందు మూత్రవిసర్జన చేస్తున్న వారిపైకి ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో శివకోటి అక్కడికక్కడే మృతి చెందగా బిల్డర్ పరి స్థితి విషమంగా ఉంది. రామకృష్ణ, శ్రీహరి, క్రాంతికుమార్ పరిస్థితి 24గంటలు గడిస్తేనే చెప్పగలమన్నారు. మహేశ్‌వర్మకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు, క్షతగాత్రులంతా దగ్గరి బంధువులు. శివకోటి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాద సమయంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.


ఘటనా స్థలిలో నుజ్జునుజ్జయిన వాహనం

ఇబ్రహీంపట్నంలో అమానుషం

- వృద్ధ యాచకురాలిపై లైంగికదాడి
- పోలీసుల అదుపులో నిందితుడు

ఇబ్రహీంపట్నం రూరల్: బస్టాండ్ సమీపంలో నిద్రిస్తున్న యాచకురాలిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాచకురాలైన వృద్ధ మహిళ బస్టాండ్ ఆవరణలోని శ్రీవెంకటేశ్వర మొబైల్ షాపు ఎదుట నిద్రిస్తుండగా రాత్రి 2:45 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి బలవంతం చేశాడు. బాధితురాలుపెద్దగా కేకలు పెడుతూ ప్రతిఘటించినా, దాడి చేసి అత్యాచారానికి ఒడిగట్టాడు. పెనుగులాటలో వృద్ధురాలి తలను నేలకేసి కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఉదయాన్నే అటుగా వెళ్తున్న వారురక్తపు మడుగులో పడి అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. మొదటి జారి పడి ఉంటుందని భావించిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి నిర్ఘాంతపోయారు. వెంటనే ఆమెను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

నాలుగు బృందాలతో గాలింపు

యాచకురాలిపై దాడికి పాల్పడిన నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ సిగ్నల్, లొకేషన్ల ఆధారంగా గాలింపు చేపట్టారు. నిందితుడు మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం అతను పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

ఏటీసీలో సీట్లు భర్తీ

తాండూరు: పట్టణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో ఆరు కోర్సులకు సీట్లన్నీ భర్తీ అయ్యాయి. 172 సీట్లకు గాను పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులతో పాటు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇండస్ట్రియల్ రొబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్(ఒక సంవత్సరం), మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్(ఒక సంవత్సరం, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్(ఒక సంవత్సరం), బీడీవీవీ వర్చువల్ ఎనాలసిస్ అండ్ డిజైనర్ (రెండేళ్లు), సీఎస్‌సీ మెషినింగ్ టెక్నీషియన్(రెండేళ్లు), ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ (రెండేళ్లు) కోర్సుల్లో ఏటీసీ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే నలుగురు విధుల్లో చేరారని చెప్పారు.

జాతీయస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు


భావన


లక్ష్మీగురుదీక్ష


నిహాంత్

అబ్దుల్లాపూర్‌మెట్: జాతీయ స్థాయి అత్యపత్య పోటీలకు పెద్ద అంబర్‌పేట్ రాజశ్రీ విద్యామందిర్ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు అత్యపత్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాయిని పోచారం సంజీవరెడ్డి తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 10న నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాజశ్రీ విద్యామందిర్ పాఠశాలకు చెందిన కె.నిహాంత్ రెడ్డి (9వ తరగతి) జె.లక్ష్మి గురు దీక్ష (8వ తరగతి), పి.భావన (9వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో వీరికి ఈ నెల 17 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని మల్కాపూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో అవకాశం కల్పించారని పాఠశాల కోచ్ నీలేశ్ తెలిపారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం సిద్ధంకి జగన్మోహన్ రెడ్డి, హెచ్‌ఎం రాజేశ్వరి, అత్యపత్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మైలారం ప్రభాకర్ విద్యార్థులను అభినందించారు.

జిల్లా స్థాయి టీఎల్‌ఎంకు బాటసింగారం పాఠశాల


సంతోష్‌కు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ జగదీశ్వర్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలో మంగళవారం బోధనోపకరణాల మేళా(టీఎల్‌ఎం మేళా)ను అట్టహాసంగా నిర్వహించారు. ఎంఈఓ జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మేళాలో మండల పరిధిలోని 52 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని బోధనోపకరణాలను ప్రదర్శించారు. ఇంగ్లిష్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బాటసింగారం జెడ్పీహెచ్‌ఎస్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సంతోష్‌ను ఎంఈఓ అభినందించారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- మూగజీవాలు అపహరిస్తున్న ముఠాకు రిమాండ్
- రూ.2.62లక్షల నగదు, నాలుగు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: మూగజీవాలను అపహరిస్తున్న ముఠాను షాద్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని సుల్తాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫెరోజ్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి పరిగి పట్టణానికి చెందిన అబ్దుల్ ఖలీం, మహ్మద్ సోహెల్, షేక్ రవూఫ్, మహ్మద్ జమీర్, కర్ణాటక రాష్ట్రం చౌడ్‌గుప్ప జిల్లా కోదంబాల్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆరీఫ్, హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్‌కు చెందిన షేక్ హసనుద్దీన్, జియాగూడకు చెందిన సాయికిరణ్‌తో స్నేహం ఏర్పడింది. జల్సాలకు అలవాటు పడిన వీరు చోరీల బాటపట్టారు. ఈ ఎనిమిది మంది ముఠాగా ఏర్పడి ఉదయం కార్లలో తిరుగుతూ మేకలు, గొర్రెలు ఎక్కడెక్కడ ఉన్నాయో రెక్కీ నిర్వహిస్తారు. రాత్రివేళ వాటిని అపహరించి జియాగూడ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

82 మేకలు.. 67 గొర్రెల అపహరణ

ఈ ముఠా షాద్‌నగర్‌పరిధిలోని చించోడ్ పటేల్‌కుంట తండాలో ఎనిమిది, పీర్లగూడలో రెండు మేకలు, సోలీపూర్‌లో 21 గొర్రెలు, చౌదరిగూడలో ఎనిమిది మేకలు, పెద్ద ఎల్కిచర్లలో 23 మేకలు, తంగెళ్లపల్లిలో ఎనిమిది మేకలు, వెంకిర్యాలలో ఎనిమిది గొర్రెలు, కుల్కచర్లలో ఎనిమిది గొర్రెలు, పరిగి మండలం నాయికోటివాడలో 12 మేకలు, సుల్తాన్‌పూర్‌లో 30 గొర్రెలు, దోమ మండలం ఉదన్‌రావుపల్లిలో 15 మేకలు, దిర్సంపల్లి తండాలో ఆరు మేకలు దొంగిలించినట్లు తెలిపారు. పీర్లగూడకు చెందిన బొగ్గుల ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక నైపుణ్యం ఆధారంగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, సీసీఎస్ సీఐ పవన్‌కుమార్, ఎస్‌ఐ భూపాల్, అవినాశ్‌బాబు, శివారెడ్డి, సిబ్బంది కుమార్, మహేందర్, నవీన్, రమేష్, రవి, భీమయ్య, కరుణాకర్, మోహన్‌లాల్, జాకీర్, రాజు, సంతోష్‌లు చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించినట్లు తెలిపారు. వీరికి తగిన రివార్డును అందించనున్నట్లు ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలు

మట్టి తవ్వకాలపై ఎస్‌ఓటీ దాడులు

కందుకూరు: నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వి తరలిస్తున్న వారిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి ఓ జేసీబీ, మూడు టిప్పర్లను సీజ్ చేశారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గూడూరు గ్రామం సర్వే నంబర్ 53లోని ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసుల సహకారంతో మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. మట్టితో ఉన్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీ, నాలుగు సెల్ ఫోన్లను సీజ్ చేశారు. తవ్వకాలకు కారకులైన గూడూరుకు చెందిన కొలుకులపల్లి సురేందర్, బండి యాదయ్య, డ్రైవర్లు కొత్తగూడకు చెందిన అమీర్‌ఖాన్, కందుకూరుకు చెందిన మార సురేష్, చింగిచెర్ల రమణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఉప్పరిగూడకు చెందిన నల్లోల కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


కందుకూరు: మట్టి తవ్వకాలు చేపట్టిన వారితో పాటు వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

మాడ్గులలో రెండు లారీలు, ఒక టిప్పర్ ..

మాడ్గుల: నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్ తెలిపిన ప్రకారం.. మంగళవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు లారీలు, ఒక టిప్పర్ మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాలను నిలిపి తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రకృతి సంపదను కాపాడుకోవాలి


కందుకూరు: మీర్‌ఖాన్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో కంపోస్టు పిట్‌ను ప్రారంభిస్తున్న దిలీప్‌రెడ్డి తదితరులు

సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రకృతి సంపదను కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల తోట, ఇంకుడు గుంత, కంపోస్టు పిట్, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యం కారణంగా భూ గ్రహం వేడెక్కుతుందని దాని సంరక్షణకు ఎర్త్ లీడర్స్ విద్యార్థి దశ నుంచి పర్యావరణ స్పృహ పెంచుకోవాలన్నారు. ఇందుకు గ్రీన్ రెవెల్యూషన్ తోడుగా ఉంటుందన్నారు. పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. బడిలోనే కూరగాయల తోటలు పెంచుకోవాలని చెప్పారు. అడవులు విస్తారంగా ఉంటేనే వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని.. దీంతో భూగర్భజలాలు పెరిగి పంటలు పండించుకునేందుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు కరుణాకర్, సమత, రామచంద్రయ్య, యాదయ్య, శ్రీవేణి, భాస్కర్, పాండు, ఎర్త్ లీడర్స్ నిహారిక, నిఖిల్, సౌరబ్, నాని, లాస్య, శ్రవణ్, లాస్య, అక్షయ, యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ రజనీకాంత్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

కందుకూరు: ప్రకృతి సంపదను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల తోట, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్, కిచెన్ గార్డెన్, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, ఎర్త్ లీడర్స్ భానుశ్రీ, సింధుప్రియ, కావ్య, దివ్య, ప్రభాస్, యూసుఫ్‌బాబా, మురళీ, నవదీప్, వరుణ్, ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ రజనీకాంత్, రాఘవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధిస్తున్న యువకులకు రిమాండ్

షాబాద్: విద్యార్థినులను వేధిస్తున్న ఇద్దరు యువకులపై షాబాద్ పోలీసులు పోక్సో కేసులు నమోదు చేశారు. మండల పరిధిలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని ఆమె సమీప బంధువు తరచూ వేధిస్తున్నాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. మరో ఘటనలో ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని బస్సు ఎక్కే క్రమంలో ఓ యువకుడు వేధించాడు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై కేసు నమోదు చేశారు. మంగళవారం ఇరువురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

సైబర్ బాధితులకు రూ.9.29 కోట్లు రీఫండ్

లోక్ అదాలత్‌లో అనేక కేసుల పరిష్కారం: అదనపు సీపీ

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన వారికి జాతీయ్ లోక్ అదాలత్ ద్వారా రూ.9.29 కోట్లు రీఫండ్ చేశామని అదనపు సీపీ (నేరాలు) పి.విశ్వప్రసాద్ మంగళవారం ప్రకటించారు. ఇది బాధితుల ఫిర్యాదుతో తక్షణం స్పందించి వివిధ బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన మొత్తమని పేర్కొన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి 941, శాంతిభద్రతల విభాగానికి సంబంధించి 1977 కేసులతో పాటు 21,394 ఈ–పెట్టీ కేసులు, 3803 ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు సైతం పరిష్కారమైనట్లు ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం..కిస్మత్‌పూర్ బ్రిడ్జి పక్కనే ఉన్న కల్లు కంపౌండ్ సమీపంలోని పొదల్లో ఓ మహిళ మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా ఒంటిపై ఎలాంటి దుస్తులు లేకుండా పడి ఉంది. సంఘటన జరిగి రెండు, మూడు రోజులు కావస్తుండటంతో పాటు రెండు రోజులుగా వర్షాలు పడటంతో మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. క్లూస్ టీమ్, డాగ్స్ టీమ్‌ను రప్పించిన పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతదేహానికి కొద్ది దూరంలో నల్లటి స్క్రాప్, నల్లటి పైజామా కనిపించింది. మృతురాలు వయస్సు 25–30 సంవత్సరాలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మహిళను ఇక్కడికి తీసుకొచ్చి లైంగికదాడికి పాల్పడి చంపారా..లేదా ఇతర ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ పడేశారా అన్నది దర్యాప్తులో తేలనుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించామన్నారు. మృతురాలికి సంబంధించిన ఫొటోలను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించామన్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

165 మెడికల్ షాపుల లైసెన్స్‌లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మెడికల్ దుకాణాలపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఉక్కుపాదం మోపుతోంది. గత నెల 22 నుంచి ఈ నెల 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. మొత్తం 809 దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో అనధికారికంగా జరుగుతున్న వ్యవహారాలను గుర్తించారు. మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టోల్ మాత్రలు, అబార్షన్ కిట్ల అక్రమ అమ్మకాలను అరికట్టాలని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ షానవాజ్ ఖాసిం తెలిపారు. తనిఖీల సమయంలో 234 దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ కిట్లు అమ్ముతున్నట్లు గుర్తించామని, ఆయా యాజమాన్యాలకు షోకాజు నోటీసులు జారీ చేశామన్నారు.

తల్లీకూతురు అదృశ్యం


సునీత, మీనాక్షి(ఫైల్)

మొయినాబాద్: భర్తతో గొడవపడి కూతురుతో కలిసి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లికి చెందిన గుగులోత్ సునీత ఈ నెల 13న భర్త మోహన్‌నాయక్‌తో చిన్న గొడవపడి కూతురు మీనాక్షిని తీసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో భర్త పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పొరిగింటి వారితో గొడవపడి గృహిణి..


మహేశ్వరి(ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరామ కాలనీలో పోచన నర్సింలు, భార్య మహేశ్వరి(44) నివాసం ఉంటున్నారు. వీరి పొరుగింటికి చెందిన వ్యక్తి కారును వీరి ఇంటి ఆవరణలో పార్కు చేస్తుండడంతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీనా సైతం మహేశ్వరి పొరుగింటి వారితో గొడవ పడిన విషయం తెలుసుకున్న నర్సింలు ఆమెను మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. గతంలో ఒక పర్యాయం ఇలాగే వెళ్లి తిరిగొచ్చింది. ఈ సారి మాత్రం ఎంతకీ రాకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

కంకిరాళ్ల తండాలో విద్యార్థి..


అరుణ్‌కుమార్

కేశంపేట: హాస్టల్‌కు వెళ్తున్నాన్ని చెప్పి ఇంట్లోంచి వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని కంకిరాళ్ల తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పుట్టోనిగూడ అనుబంధ గ్రామం కంకిరాళ్ల తండాకు చెందిన పాత్లావత్ రవికి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు పాత్లావత్ అరుణ్ కొత్తపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న తండ్రి రవి తన కొడుకును హాస్టల్ నుంచి ఇంటికి తీసుకొచ్చాడు. 15వ తేదీన ఉదయం విద్యార్థి అరుణ్ హాస్టల్‌కు వెళ్తున్నాని చెప్పి బయలుదేరాడు. అదే రోజు సాయంత్రం రవి హాస్టల్‌కు ఫోన్ చేయగా హాస్టల్‌కు రాలేదని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గద్వాల్‌లో బాలుడి ఆచూకీ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

అదుపు తప్పిన బైక్

యువకుడి దుర్మరణం


అక్షిత్‌రెడ్డి (ఫైల్)

మీర్‌పేట: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా.. మరో యువకుడు గాయపడ్డారు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. ప్రశాంతిహిల్స్‌కు చెందిన భూపతిరెడ్డి కుమారుడు అక్షిత్‌రెడ్డి(21) డిగ్రీ పూర్తి చేశాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడు రాజారామ్‌తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై ప్రశాంతి హిల్స్ నుంచి అల్మాస్‌గూడ కమాన్‌వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అక్షిత్‌రెడ్డి రోడ్డుపై పడిపోగా రాజారామ్ ఎదురుగా వస్తున్న స్కూటీపై పడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అక్షిత్‌రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవిష్యత్ 'ఏఐ'దే..

మొయినాబాద్: భవిష్యత్ కృత్రిమ మేధస్సుదేనని.. కృత్రిమ మేధస్సును భూ విజ్ఞాన, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలతో సమన్వయం చేయాలని ఎర్త్ సెన్స్–2025 అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల వక్తలు అభిప్రాయపడ్డారు. మున్సిపల్ పరిధిలోని కేఎల్‌హెచ్ వర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న 'ఎర్త్‌సెన్స్–2025'అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు హాజరైన అర్జెంటీనాకు చెందిన ప్రొఫెసర్ అనా బెల్లా ఫెర్రల్, మలేషియాకు చెందిన ప్రొఫెసర్ నార్మా అలియాస్, ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ డైరెక్టర్ నీలేశ్ దేశాయిలు తమ అభిప్రాయాలను అందరితో పంచుకున్నారు. భూసమీకరణ, పర్యావరణ పర్యవేక్షణ, వాతావరణ మార్పు పరిష్కారాలు, స్థిర వనరుల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఆయా అంశాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం, భూవిజ్ఞానం, రిమోట్ సెన్సింగ్, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాల పురోగతిపై మూడు రోజుల సదస్సులో చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, ప్రతినిధులు బోహారీ మహత్, పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు